గాయత్రి దేవి అలంకరణలో..

అమ్మవారి ఆలయాల్లో భాగంగా విజయనగర్ కాలనీ శ్రీ హనుమాన్ దేవస్థానం ఆవరణలోని శ్రీ బాలత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు వైదిక నిర్వాహకులు అశోక్ జోషి ఆధ్వర్యంలో నిత్య సేవలు నిర్వహించారు. ఈ పూజల్లో శివాలయం అర్చకులు శ్రీనివాస శర్మ, రామాలయం అర్చకులు రాజ్‌కుమారాచార్యులు, హనుమాన్ ఆలయం అర్చకులు రామేశ్వర్ జోషి పాల్గొన్నారు. - **సుల్తాన్‌బజార్, అక్టోబర్ 17**

అమ్మవారికి కుంకుమార్చన

దేవీ శరన్నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని దూద్‌బౌలి పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు సుంకరి హనుమంత్‌రావు, శేఖర్‌రెడ్డి తెలిపారు. అమ్మవారు మంగళవారం అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనం అందించారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సహస్ర నామ కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శ్యాంరావు, శేఖర్, దేవేందర్ పాల్గొన్నారు. - **చార్మినార్, అక్టోబర్ 17**

మాతా విశాల్ జాగరణ

తుల్జాభవాని ఆలయంలో మాతా విశాల్ జాగరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్ విచ్చేసి పూజలు చేశారు. ముఖేశ్ సింగ్ మాట్లాడుతూ.. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాతా విశాల్ జాగరణ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. జాగరణలతో ప్రజలలో భక్తి భావం పెంపొందుతుందన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. - **అబిడ్స్, అక్టోబర్ 17**

సమస్యల పరిష్కారానికి కృషి

నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. కార్వాన్ డివిజన్‌లో కార్పొరేటర్ ఎం. స్వామి యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

- **కార్వాన్, అక్టోబర్ 17**

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. గోషామహల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. - **అబిడ్స్, అక్టోబర్ 17**

నేటి నుంచి ఎగ్జిబిషన్ మైదానంలో దాండియా

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గర్భా దాండియా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావులు వెల్లడించారు. 18వ తేదీ బుధవారం నుంచి ఐదు రోజుల పాటు దాండియా వేడుకల నిర్వహణ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి దాండియా వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ సంవత్సరం నిర్వహించే దాండియా వేడుకలకు నగర వాసులే కాక పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దాండియా ప్రియులు తరలివస్తారని వివరించారు. ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాత్రి 12 గంటల వరకు దాండియా వేడుకలు కొనసాగిస్తామన్నారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని చాటే విధంగా వేడుకలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏనుగుల రాజేందర్, అనిల్ స్వరూప్ మిశ్రా, మనోజ్ జైస్వాల్, సురేందర్‌రెడ్డి, డాక్టర్ వంశీ తిలక్, గిరిధర్ లాల్ దాగా పాల్గొన్నారు. - **అబిడ్స్, అక్టోబర్ 17**

మరమ్మతుల కారణంగా..

మెహిదీపట్నం, అక్టోబర్ 17 : మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ 11 కేవీ జహరా మసీద్ ఫీడర్ పరిధిలోని హుమాయూన్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, ఒవైసీ పార్కు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 : 30 నుంచి మధ్యాహ్నం 1 : 30 గంటల వరకు,11 కేవీ సాలెనగర్ ఫీడర్ పరిధిలోని సాలెనగర్ కంచ, ధాన్ కోట ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

చార్మినార్, అక్టోబర్ 17 : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన హుస్సేని ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సుధీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూసాబౌలి సమీపంలోని ఎస్‌బీఐ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నారని డయల్ 100 ద్వారా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ప్రశాంత్‌గౌడ్, విష్ణుచందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారకంగా పడి ఉన్న వ్యక్తిని గుర్తించి చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు చెందినట్లు వైద్యులు వెల్లడించారని ఎస్సై తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నిందితుడికి పది రోజుల జైలు

అబిడ్స్, అక్టోబర్ 17 : ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం 10 రోజుల జైలు శిక్ష విధించింది. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గన్‌ఫౌండ్రీ ప్రాంతంలోని ఒక పాఠశాలలో పని చేసే మహిళపై అదే పాఠశాలలో పనిచేసే మహ్మద్ దస్తగిరి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై ఈ పెట్టి కేసు నమోదు చేసి మూడవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిచ్చారు. అబిడ్స్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఇండ్ల స్థలాలు ఇప్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సువర్ణరెడ్డి

రవీంద్రభారతి,అక్టోబర్ 17 : తమ ఇండ్ల స్థలాల కోసం 1983లో ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి రైతు కుటుంబాల నుంచి 490 ఎకరాలు రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలో కొనుగోలు చేశాం. 3వేల 33ప్లాట్స్‌ను 3వేల 328 మంది సభ్యులు ఐదు వందల గజాల చొప్పున శంకర్ హిల్స్ ప్లాట్స్ పర్చేసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఇండ్ల స్థలాను కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని అసోసియేషన్ వెల్ఫేర్ సభ్యులు చెప్పారు. మంగళవారం బషీర్‌బాగ్‌ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ సువర్ణారెడ్డి, కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మీము ఇండ్లు కట్టుకోవడానికి ప్లాట్ల దగ్గరికి పోతే కబ్జాదారులు బెదిరించి విద్యుత్ కనెక్షన్ తీసుకోకుండా, ఇండ్లు కట్టకుండా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మా ప్లాట్లను కాపాడి మాకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శంకర్ హిల్స్ ప్లాట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన అవసరం

చాదర్‌ఘాట్, అక్టోబర్ 17: శస్త్ర చికిత్సల నేపథ్యంలో శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన అవసరమని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ శివానంద రెడ్డి అన్నారు. మంగళవారం మలక్‌పేట కేర్ హాస్పిటల్స్‌లో మైక్రో వాస్కులర్ సర్జరీ స్కిల్స్ ట్రైనింగ్ పై ఒక రోజ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరోసైన్సెస్ సర్జికల్ అనాటమీ, విధానాలపై పరిజ్ఞానాన్ని మెరుగుపరచడానికి అనాటమీ టీచింగ్ సెషన్ ను రోజంతా నిర్వహించారు.

నేషనల్ ఫ్యాకల్టీ, ఎంజీహెచ్ హెల్త్‌కేర్ చెన్నై, న్యూరోసైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రూపేశ్ కుమార్, ఒమెగా హాస్పిట్‌లోని న్యూరోసర్జన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ టి.నరసింహరావు ఉన్నారు.

దేశంలోని 25 మంది వైద్య ప్రతినిధులు హాజరు కావడంతో ప్రత్యేకత చేకూరిందని కె.వి.శివానంద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అరుణ్ తెలిపారు. డాక్టర్ కే.వీ.శివనంద్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్జికల్ అనాటమీ, ముఖ్యంగా మైక్రో సర్జరీ రంగంలో అనుభవం ఉన్నప్పటికీ సవాలుగా కనిపిస్తుందన్నారు. మైక్రో సర్జికల్ ఆపరేషన్ ,న్యూరో వాస్కులర్ విషయంలో ఇంకా పరిణితి సాధించాలన్నారు.

వర్క్‌షాపునకు విచ్చేసిన వైద్య ప్రముఖులు